క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పకు పూజలు



స్వామిని ఊరేగిస్తున్న అయ్యప్ప భక్తులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి బైపాస్ వద్ద అయ్యప్ప కాలనీలోని ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయ పునః ప్రతిష్ఠ, కుంభాభిషేకం సందర్భంగా పట్టణంలో విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు కొక్కొండ శ్రీశైలం గురుస్వామి నవరత్నాలయ ఆలయం వద్ద ఊరేగింపు ప్రారంభించారు. కేరళ వాయిద్యం, గుర్రపు ప్రదర్శన, పూణే బ్యాండు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గౌడ్, కోశాధికారి ప్రేమ్ సాగర్, కార్యనిర్వాహక కార్యదర్శులు గోపాల్, అయ్యప్ప స్వామి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పైపులైనుకు మరమ్మతులు



పనులను పర్యవేక్షిస్తున్న వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైనుకు పట్టణ శివారులో ఆదివారం లీకేజీ ఏర్పడింది. దీంతో నీటి సరఫరా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. వేసవి కాలం కావడంతో నీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడకూడదనే ఉద్దేశంతో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, సవిత వెంటనే స్పందించి మరమ్మతులు పూర్తిచేయించి నీటి సరఫరాను పునరుద్ధరింపజేశారు.

అప్రమత్తత అవసరం

ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి

రాయికోడ్(అందోల్): మండలంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వట్‌పల్లి, అల్లాదుర్గం మండలాల్లో వరుసగా దేవాలయాల్లోని హుండీల దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆలయాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ సూచించారు.

కరపత్రాల పంపిణీ

మునిపల్లి(అందోల్): నర్సాపూర్ మండలం నృసింహపురం(రుస్తుంపేట) ఆత్మానందాశ్రమం లక్ష్మీనర్సింహస్వామి 63వ ఆలయ వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆశ్రమ భక్త బృందం సభ్యులు నాగయ్య, మల్లేశం, నర్సింహులు, గోపాల్ ఆదివారం ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 4వ తేదీన స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే 5న కల్యాణం, 6న రథోత్సవం ఉంటుందని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఆత్మానందాశ్రమ అధ్యక్షుడు గుర్రాల భాను ప్రకాశ్, సంగమేశ్వర్,

బ్రాహ్మణ సంఘం కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

నారాయణఖేడ్: మండల బ్రాహ్మణ సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. అధ్యక్షుడుగా బక్షి రవీంద్రరావు, ఉపాధ్యక్షులుగా సురేశ్‌రావు, అనంతరావు దేశ్‌పాండే, సుజిత, ప్రధాన కార్యదర్శిగా నర్సింహారావు, సంయుక్త కార్యదర్శులుగా మలమంచి మనోజ్, సంతోష్ దేశ్‌పాండే, కోశాధికారిగా చంద్రకాంత్, కార్యవర్గ సభ్యులుగా సంజీవ్ కుమార్, అనంత పద్మనాభం, ప్రథమేశ్, బక్షి నవనీత్, నవీన్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బక్షి కిషన్‌రావు వ్యవహరించి ఎన్నికైన వారికి ధ్రువపత్రాలను అందజేశారు.


కల్లు పారబోత

నిజాంపేట(మెదక్): మండలంలోని కల్వకుంటలో ఆదివారం కొందరు కల్లు సీసాలను పారబోశారు. కల్లు రుచిగా లేదని, రెండు, మూడు రోజులుగా తాము చెప్తున్నా.. దుకాణం నిర్వాహకులు ఎంతమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు కొందరు ఆరోపించారు. ఈమేరకు దుకాణానికి వచ్చిన కల్లు పెట్టెలో కొన్నింటిని పారబోశారు. ఈ విషయమై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

దాహార్తి తీరుస్తాం..

- చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- సిద్ధమైన మున్సిపల్ అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎండలు ఉధృతమవుతుండడంతో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అనేక కొత్త కాలనీలు అభివృద్ధి చెందుతున్నాయి. వాటితోపాటు అనేక భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతానికి పలురాష్ట్రాల నుంచి భవననిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో వలస వచ్చారు. వారిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 17 వార్డులు ఉండగా మొదట ఆరు ప్రాంతాలలో అధికారులు చలివేంద్రాలను



మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మంచినీటి కుండ

ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాలలో వివిధ సేవాసంఘాలు, రాజకీయ నేతలు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ప్రాగంణంలో విద్యుత్‌నగర్ ట్యాంక్ వద్ద, కొల్లూర్, ఈదుల నాగులపల్లి, వెలిమెల, ఇందిరానగర్ సర్కిల్ వద్ద నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయం భవనం వద్ద అధికారులు చలివేంద్రాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. బాటసారులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు.

బాటసారులకు అందుబాటులో..

కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రాంతంలో ఎక్కువగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని రోడ్ల పక్క మట్టికుండలతో నీళ్ల ఏర్పాటుచేసి నిత్యం వాటి ద్వారా బాటసారుల దాహార్తిని తీర్చడానికి చర్యలు చేపట్టాం.

– సంగారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్

ఘనంగా పరిశుద్ధ వారం



జహీరాబాద్ సెంట్రల్ చర్చి వద్ద మట్టలతో చిన్నారులు

- ఉత్సాహంగా క్రైస్తవుల ర్యాలీలు
- ప్రత్యేక ప్రార్థనలు, గీతాలాపనలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో అల్లీపూర్ మెథడిస్టు సెంట్రల్ చర్చిలో మట్టల ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గుడ్ ఫ్రైడే ముందు వచ్చే ఆదివారం రోజు ఈ వేడుక చేసుకుంటారు. ఈ వారాన్ని పరిశుద్ధంగా పరిగణిస్తారు. ఉదయం నుంచి క్రైస్తవులు సెంట్రల్ చర్చికి తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలుచేసి గీతాలను ఆలపించారు. అనంతరం చిన్నారులు ఈత మట్టలు పట్టుకొని ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెవ.జాన్‌వెస్లీ, రెవ. విద్యాసాగర్, పాఠశాల సూపరింటెండెంట్ సులక్షణ, వైఎంసీఏ నాయకులు డాక్టర్ సరీన్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్)లో..

ఝరాసంగంతో పాటు ఆయా గ్రామాల్లో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



ఝరాసంగంలో..

వీధుల గుండా ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంతరావు పాటిల్, సందేశకులు ప్రభుదాస్, నాయకులు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కోహీర్(జహీరాబాద్)లో..

మండలంలోని ఆయా గ్రామాలలో క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈత మట్టలకు రంగురంగుల పూలను అందంగా అలంకరించి భక్తిగీతాలు పాడుతూ చిన్నారులు వాడవాడలా ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘకాపరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

బ్రాహ్మణ సంఘం నేత నరసింహారావు

సదాశివపేట(సంగారెడ్డి): బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. స్థానిక గుండంబావి వద్ద ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు నరసింహారావు కులకర్ణి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. బ్రాహ్మణ సంఘం మహిళలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మనోహర్, కోశాధికారి నరేశ్ దేశ్‌పాండే, రాజేశ్వరరావు పట్వారి, శ్రీకాంత్ జోషి, చక్రధరరావు, మహిళా బ్రాహ్మణ



మహిళలను సన్మానిస్తున్న నాయకులు

సంఘం అధ్యక్షురాలు జ్యోతి కులకర్ణి, సురేశ్ కులకర్ణి, రంగారావు, రవికుమార్, సుబ్బలక్ష్మి, గోదావరి, విజయలక్ష్మి, ఉమాదేవి, శశి, గిరిజ, లీలాదేవి, రూప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని అందించండి

- చెడిపోయిన చేతిపంపు
- నెల రోజులుగా నీటికోసం తిప్పలు

జహీరాబాద్ టౌన్: మండలంలోని దిడ్గి గ్రామంలోని ఎస్సీ కాలనీలో చేతిపంపు చెడిపోయి నీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చేతి పంపే దిక్కు. అయితే నెల రోజుల నుంచి బోరు పనిచేయడం లేదు. దీంతో కాలనీ ప్రజలు బిందెడు నీళ్ల కోసం సమీపంలో పొలాల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఎండలు మండుతుండడంతో నీటి అవసరాలు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతి పంపునకు మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. అలాగే కాలనీలో విద్యుత్ దీపాలు కూడా లేవని, చీకట్లో ఉండాల్సి వస్తోందని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ఎస్సీకాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని, చేతి పంపునకు మరమ్మతులు చేయించే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.



ఎస్సీ కాలనీలో చెడిపోయిన చేతిపంపు

రంగులమయం.. హోలీ సంబురం



హత్నూర(సంగారెడ్డి): హోలీ సంబరాల్లో యువకులు

హత్నూర(సంగారెడ్డి): జిల్లాలో హోలీ సంబురాలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన హత్నూరలో ఆదివారం చిన్నా, పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకొని ఉత్సాహంగా గడిపారు. యువత కేరింతల కొడుతూ గ్రామ వీధుల గుండా తిరుగుతూ ఒకరికొకరు రంగులు పూసుకుని హోలీ సంబురాలు నిర్వహించుకున్నారు.

సదాశివపేట(సంగారెడ్డి)లో..

పట్టణంలో శాస్త్రిరోడ్, సుభాస్ రోడ్, పాతకేరీ, లోపలి కోట హనుమాన్ మందిర్ తదితర ప్రాంతాల్లో హోలీ పండుగ ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామున యువకులు కామ దహనం చేశారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఆనందించారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా రాంచందర్



జహీరాబాద్ టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంలోని దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. కన్వీనర్‌గా ప్రముఖ కవి, గాయకుడు రాంచందర్ భీంవంశీ, కో కన్వీనర్లుగా దశరథ్, ఆర్.నర్సింహులు, బాల్‌రాజ్, మచ్చెందర్, వసంత్, రాములు, నాగేందర్, అంజయ్య, హొలియా రాములు, మారుతి, తులసీరాం రాథోడ్ తదితరులు ఎన్నికయ్యారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని రాంచందర్ కోరారు.

ఆదర్శ రైతులను నియమించాలని వినతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆదర్శ రైతులను తిరిగి నియమించాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు చీల విశ్వేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రైతులకు, ప్రభుత్వానికి అనుసంధాన కర్తలుగా ఆదర్శ రైతులు ఎన్నో సేవలు చేశారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గ్రామానికి ఒక్కరు చొప్పున ఆదర్శ రైతులను నియమించి రైతులకు సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కాముడి దహనం



జహీరాబాద్ టౌన్: సిద్ధేశ్వర ఆలయం వద్ద..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సిద్దేశ్వర ఆలయం వద్ద ఆదివారం రాత్రి కాముడి దహనం నిర్వహించారు. హోలీ పండగకు ఒక రోజు ముందు రాత్రి కాముడి దహనం చేయడం ఆనవాయితీ. ఆలయ పూజారి సంగమేశ్వర స్వామి ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతిలో కాముడిని దహనంచేసి భక్తి శ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. పట్టణంలోని నాగులకట్ట, హౌసింగ్‌బోర్డు, శాంతినగర్, ఆర్యనగర్, గడి, రంజోల్, పస్తాపూర్, చిన్నహైదరాబాద్, అల్లీపూర్ తదితర ప్రాంతాల్లో కూడా ప్రజలు కాముని దహనం నిర్వహించారు. సోమవారం హోలీ జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. పట్టణ సమీపంలోని సిద్దేశ్వర గోశాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కోహీర్(జహీరాబాద్): మండలంలోని ఆయా గ్రామాలలో శనివారం రాత్రి ఉత్సాహంగా కాముడిదహన వేడుకలు నిర్వహించారు. యువకులు, చిన్నారులు ఇంటింటికీ తిరిగి కట్టెలు పోగుచేసి ఆయా గ్రామాల కూడళ్లలో పూజలు నిర్వహించి కాముడి దహనం చేశారు. మహిళలు ప్రత్యేక గీతాలు ఆలపించారు. గుడాల ప్రసాదాలను పంచిపెట్టారు.

ఎండలోనే.. ఎదురుచూపు

- నిలిచిపోయిన బస్ షెల్టర్ల నిర్మాణాలు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

హత్నూర(సంగారెడ్డి): దశాబ్దాలు గడుస్తున్నా అసంపూర్తిగా ఉన్న బస్ షెల్టర్ల నిర్మాణం పూర్తి చేయాలన్న ధ్యాస అధికారులకు, ప్రజా ప్రతినిధులకు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హత్నూర శివారులో కొన్యాల వద్ద రెండు దశాబ్దాల క్రితం నిర్మాణం చేపట్టిన షెల్టర్‌ల పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. చందాపూర్, మల్కాపూర్, షేర్‌ఖాన్ పల్లి, నాగారం గ్రామాలలోని స్టేజీల వద్ద నిర్మించిన బస్ షెల్టర్లది కూడా అదే దుస్థితి. ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు, నేతలు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖర్చు చేసిన నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చందాపూర్ గేటు వద్ద అసంపూర్తిగా ఉన్న బస్‌షెల్టర్

నిర్మాణాలు పూర్తిచేయాలి

అసంపూర్తిగా ఉన్న బస్ షెల్టర్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి. బస్సుల కోసం ఎండలోనే ఉండాల్సి వస్తోంది. చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– గొల్ల కృష్ణ, చందాపూర్

ఉత్సాహంగా స్నాతకోత్సవం



సర్టిఫికెట్లతో విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో యూకేజీ విద్యార్థుల స్నాత కోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం విద్యార్థులు స్నాతకోత్సవ గౌన్లు, క్యాప్‌లతో సందడి చేశారు. వేదికపైకి వచ్చి తమతమ సర్టిఫికెట్లను అందుకున్నారు. వారు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.కవిత, ఇన్‌చార్జి ఎన్‌శ్రీదేవి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖాన ఏర్పాటుకు స్థల పరిశీలన

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు: బస్తీ దవాఖాన ఏర్పాటుకు జేపీ కాలనీ రోడ్ నెంబర్ 1లోని పార్క్ స్థలాన్ని పరిశీలించామని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ చెప్పారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో ఆయన పర్యటించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్మశాన వాటికలో విద్యుత్ స్తంభాలను తొలగించి ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులతో ఆయన మాట్లాడి సమస్య పరిష్కారానికి ఆదేశించారు. అనంతరం యాదవ స్మశాన వాటికలో తన సొంత నిధులతో చితి మండపాల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయన వెంట ఆయా కాలనీల వాసులు ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్, సిబ్బంది

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



విజేత జట్టుకు కప్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ నరేశ్

జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేశ్ బహుమతులను ప్రదానం చేశారు. గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని గ్రామ క్రైస్తవులు ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు. మూడు రోజులపాటు కొనసాగిన టోర్నమెంట్ ఆదివారం ఫైనల్ పోటీలు జరిగాయి. జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. టోర్నీ విజేత జట్టు లిటిల్‌స్టార్‌కు రూ.10వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నరప్‌కు రూ.5వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బూచినెల్లి యువత క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎ.శ్రీనివాస్, ఏడం, లాజర్, ధన్‌రాజ్, ప్రశాంత్, సుధాకర్, దయానంద్, దినేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలి

చేగుంట(తూప్రాన్): టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలని విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాయి హరిప్రసాద్ కోరారు. ఆదివారం ఆయన చేగుంటలో మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం టెట్ అర్హత పరీక్ష కోసం ఒక్కో పేపర్‌కు రూ.వేయి కేటాయించడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి ఫీజుల తగ్గింపుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుఖాయం

నియోజకవర్గ కన్వీనర్ రజనీ కాంత్

నారాయణఖేడ్: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, మండలశాఖ అధ్యక్షుడు దశరత్ ధీమా వ్యక్తం చేశారు. నారాయణఖేడ్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల పూర్తిస్థాయి కమిటీని నియమించారు. ఉపాధ్యక్షులుగా మహిపాల్, రాజు, మహిపాల్‌రెడ్డి, శివ, ప్రధాన కార్యదర్శులుగా విఠల్, సచిన్ పాటిల్, సహాయ కార్యదర్శులుగా అశోక్, వెంకటేశ్, సిద్ధు, దత్తు, ప్రభు, కోశాధికారిగా అరవింద్, కార్యవర్గ సభ్యులుగా రఘుపతిరెడ్డి, పాండు, ప్రతాప్‌రెడ్డి, రాజు, సంతోష్, నాందేవ్, రాజు, సందీప్‌పాటిల్, రాంజీ నాయక్, రమేశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్, ప్రభాకర్, దత్తు, హన్మంతు, సర్దార్ నియమితులయ్యారు. యువ మోర్చా అధ్యక్షుడుగా భూమ్‌రాజ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడుగా ప్రవీణ్‌కుమార్, గిరిజన మోర్చా అధ్యక్షుడుగా పవన్, మైనార్టీ మోర్చాకు ఇస్మాయిల్, బీసీ మోర్చాకు సాయిసాగర్‌ను నియమించారు.



నారాయణఖేడ్: ధ్రువపత్రం అందజేస్తున్న రజనీకాంత్

పుల్‌కల్(అందోల్)లో..

బీజేపీ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పండరి, ఉపాధ్యక్షులుగా కృష్ణగౌడ్, ఎర్రలింగం, నవీన్, రమేశ్, ప్రధాన కార్యదర్శులుగా జగన్ గౌడ్, యాదయ్య, కార్యదర్శులుగా సుధాకర్, దత్తు, అంజయ్య, శ్రావణ్, బాబు, కోశాధికారిగా దేవగౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడుగా కార్తిక్‌గౌడ్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడుగా శ్రీశైలం, బీసీ మోర్చా అధ్యక్షుడుగా కళ్లపల్లి నర్సింహులు, మహిళ మోర్చా అధ్యక్షురాలిగా కలాలి వినోద, ఎస్సీ మోర్చా అధ్యక్షుడుగా బేగరి శేఖర్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడుగా కెదావత్ పాండు రంగంను ఎన్నుకున్నారని ఆ పార్టీ అందోల్ అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ మటం చంద్రశేఖర్ తెలిపారు.

రాయికోడ్(అందోల్)లో..

అందోల్ అసెంబ్లీ కన్వీనర్ చంద్రశేఖర్, నాయకులు ఋషి పండిత్, మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో మండల కమిటీ నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా బి.నర్సింహులు, పి.మహేశ్, ఉపాధ్యక్షులుగా విశ్వనాథ్, ఆగంరెడ్డి, రాజు, మల్లేశం, బీజేవైఎం, కిసాన్, బీసీ మోర్చా అధ్యక్షులుగా సీహెచ్.శ్రీకాంత్, తుకారాం, వీరన్న పాటిల్‌ను ఎన్నుకున్నారు. అనంతరం బూత్ కమిటీ అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.